క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



జీఎస్టీ తగ్గింపు వివరాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: కేంద్రం వివిధ రకాల వస్తు సేవలపై తగ్గించిన పన్నులపై కొనుగోలుదారులు, వ్యాపారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ బొడ్డేపల్లి రామారావు తెలిపారు. మండల కేంద్రంలో జీఎస్టీ తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రోణంకి ఆనందరావు, వ్యవసాయాధికారి మన్మథరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం సభ్యునిగా గొండు



గొండు సత్యం

నరసన్నపేట: జిల్లా వినియోగదారుల ఫోరంను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. నరసన్నపేటకు చెందిన న్యాయవాది గొండు సత్యనారాయణ (సత్యం)ను సభ్యునిగా నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వచ్చాయని సత్యనారాయణ తెలిపారు. ఈ ఫోరానికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. వివిధ శాఖల అధికారులతోపాటు మరో 16 మంది సభ్యులను వివిధ మండలాల నుంచి నియమించారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు



అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాసబాబు

పొందూరు: వ్యవసాయ పరికరాలపై రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీని 7 శాతం నుంచి 13 శాతం వరకు తగ్గించిందని ఎంపీడీఓ వాసుదేవబాబు, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసబాబు తెలిపారు. స్థానిక సచివాలయం-1 వద్ద రైతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు, పాలకాన్లు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు, ఆక్వాకల్చర్ పరికరాలు తదితర వాటిపై జీఎస్టీ తగ్గింపు వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీధర్, ఏపీఓ శ్రీనివాసరావు, ఈఓ మోహన్‌బాబు, వీఏఏ కాశీకుమార్, రైతులు, వర్తకులు పాల్గొన్నారు.

పరామర్శ..



సునీల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామానికి చెందిన చిన్నాల సునీల్ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు ఉన్నారు.

శ్రేయా మిశ్రోకు సమ్మోహన్ అవార్డు



శ్రేయా మిశ్రోను అభినందిస్తున్న కేరళ గవర్నర్

పాతపట్నం: కేరళలోని తిరువనంతపురంలో డిఫరెంట్ ఆర్ట్స్ సెంటర్ ఇటీవల నిర్వహించిన సమ్మోహనం నృత్య పోటీల్లో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయా మిశ్రో ప్రతిభ కనబర్చారు. మహిషాసుర మర్దిని, పళ్లెంతో నృత్యానికి (ప్లేట్ డాన్స్) జాతీయ స్థాయిలో సమ్మోహన్ అవార్డు వరించింది. సంగీతం, నృత్యం, గానం, చిత్రలేఖనంలో దివ్యాంగులకు జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించారు. శ్రేయా మిశ్రో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శను కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తిలకించి అభినందించారు. గతంలో ఏపీ మాజీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. శ్రేయా మిశ్రోకు మంచి గుర్తింపు రావడంపై తల్లిదండ్రులు శివప్రసాద్ మిశ్రో, పద్మావతి మహాపాత్రో, పాతపట్నం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

3న వైద్య శిబిరం

నరసన్నపేట: ఈ నెల 3వ తేదీన స్థానిక కోవెల వీధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెమ్స్ ఆస్పత్రి నుంచి కార్డియాలజిస్టు, ఆర్థోపెడిక్ వస్తున్నారని, విశ్రాంత ఉద్యోగులతోపాటు హెల్త్ కార్డు ఉన్న వారందరూ వచ్చి తనిఖీలు చేయించుకోవచ్చన్నారు. సుగర్, బీపీ పరీక్షలతోపాటు ఈసీజీ వంటి సేవలు ఉచితంగా అందిస్తారన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైద్యుల సమ్మెతో.. రోగుల అవస్థలు

- పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందే దిక్కు..
- డిమాండ్లు పరిష్కరించాలని వైద్యుల నిరసన



సారవకోట పీహెచ్‌సీలో రోగికి వైద్య సేవలందిస్తున్న ఫార్మసిస్టు



సారవకోట పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న బెడ్లు

సారవకోట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని పనిచేస్తున్న వైద్యులు ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సెప్టెంబర్ 26వ తేదీన ఆన్‌లైన్ రిపోర్టింగ్ సేవలు బంద్‌తో తమ నిరసన ప్రారంభించారు. ఆరు రోజులుగా నిరసన తెలియజేయడంతో పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు..

నరసన్నపేట నియోజకవర్గంలో నరసన్నపేట మండలంలో మాకివలస, ఉర్లాం, జలుమూరు మండలంలో జలుమూరు, అచ్చుతాపురం, సైరిగాం, పోలాకి మండలంలో గుప్పెడుపేట, పోలాకి, సారవకోట మండలంలో సారవకోట, బొంతు పీహెచ్‌సీల్లో వైద్యులు లేక పోవడంతో స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఫార్మసిస్టులు విధులు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో రోగులు ఆర్‌ఎంపీ వైద్యుల దగ్గర చికిత్స చేయించుకోవడం మంచిదనే ఆలోచనకు వస్తుండటంతో పీహెచ్‌సీలు ఖాళీగా ఉంటున్నాయి.

నరసన్నపేట నియోజకవర్గంలో పీహెచ్‌సీలు..

మండలం	పీహెచ్‌సీలు
నరసన్నపేట	2
జలుమూరు	3
సారవకోట	2
పోలాకి	2

డిమాండ్లు ఇవే..

ప్రభుత్వ వైద్యులు జీఓ 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీసు పీజీ కోటా పునరుద్ధరించాలని, సమయ నిర్ధారితమైన ప్రమోషన్లు, ట్రైబల్ అలవెన్స్, సంచార చికిత్స అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్ తదితర తమ న్యాయమైన డిమాండ్ల సాధనపై పోరాటం చేస్తున్నారు. వీరు చేస్తున్న పోరాటానికి కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి చర్చలకు పిలవకపోవడంతో బుధవారం జిల్లా కేంద్రంలో నిరసనలు చేపట్టారు.

ప్రైవేట్ వైద్యులే దిక్కు..

పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సారవకోట మండలంలోని గిరిజన గ్రామాలైన సవరబొంతు, బొంతుగూడ, పనసలోవ, పాతూరు, వెంకంపేట, జగన్నాథపురం, సవరపేట, రైవాడ, పురుషోత్తుకర్ర, కోనవానిపేట, చిన్నగుజ్జువాడ తదితర గిరిజన గ్రామాల్లో సరైన వైద్యం అందడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైద్యులు రెండో సారి తమ నిరసన తెలియజేస్తున్నా చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. గ్రామాల్లో అంటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. పొలాలకు వెళ్లే రైతులు పాములు, విష పురుగుల బారిన పడుతున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో లేక పోవడంతో ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి



ఈ నెల 26 నుంచి తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేస్తున్నాం. ప్రభుత్వం తమ సమస్యలను దృష్టిలో పెట్టుకుని పరిష్కరించాలని కోరుతున్నాం. గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించాలి.

– డాక్టర్ డి.సుధారాణి, బొంతు పీహెచ్‌సీ, సారవకోట మండలం

మార్కెట్‌కు దసరా శోభ



పాతపట్నం: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పాతపట్నం మార్కెట్

మార్కెట్లలో దసరా సందడి నెలకొంది. గురువారం దసరా పండగ పురస్కరించుకుని బుధవారం సాయంత్రం మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. కొబ్బరికాయలు, పండ్లు, నిమ్మకాయలు, వివిధ రకాల పూజాసామగ్రికి గిరాకీ నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



కొత్తూరు: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న కొత్తూరు మార్కెట్



కొత్తూరు: వాహనాలకు ముస్తాబు చేసేందుకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పొంచి ఉన్న ప్రమాదం

కొత్తూరు:

మండలంలోని వంశధార నదిపై ఆంధ్రా - ఒడిశా రాష్ట్రాలను కలిపే అంతర రాష్ట్ర వంతెన మాతల-నివగాం రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. రోడ్డు నిర్మాణంలో వేసిన గజాలు తేలిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. వంతెనపై గోతులు ఏర్పడటం వలన ఎదురుగా వస్తున్న వాహనదారులు ఎటువైపు వెళ్లాలో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతుల వలన పెను ప్రమాదాలు జరగక ముందే ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



వంతెనపై ఏర్పడిన గోతుల్లో తేలిన గజాలు

బ్యాంకు లావాదేవీలకు అంతరాయం

సరుబుజ్జిలి: సీబీఎస్ మైగ్రేషన్‌లో జరగనున్న మార్పుల వలన ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుల్లో ఎటువంటి లావాదేవీలు జరగవని పురుషోత్తపురం ఏపీజీబీ మేనేజర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమయంలో ఫోన్ పే, గూగుల్ పే, ఏటీఎం, ఏఈపీఎస్ వంటివి కూడా పనిచేయవన్నారు. అత్యవసర లావాదేవీలు ఉంటే ఈ నెల 4వ తేదీలోగా పూర్తిచేసుకోవాలన్నారు.

గ్రామ, మండల కమిటీలు పూర్తిచేయాలి

- ధర్మాన కృష్ణచైతన్య



నాయకులతో సమీక్ష చేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామాల్లో పార్టీ అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ అనుబంధ కమిటీల ఏర్పాటుపై నాలుగు మండలాలకు చెందిన ప్రధాన నాయకులతో సమీక్ష చేశారు. మండల కమిటీలు కూడా పూర్తి చేయాల్సి ఉందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యవర్గంతోపాటు రైతు, మహిళ, యువజన, బీసీ, ఎస్సీ, సోషల్ మిడియా విభాగాలకు అనుబంధ కమిటీలు వేయాల్సి ఉందన్నారు. పార్టీ కార్యవర్గంతోపాటు రైతు, మహిళ, యువజన కమిటీలు ఏర్పాటు పూర్తయ్యాయన్నారు. బీసీ, ఎస్సీ, సోషల్ మీడియా కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయిలో 21 కమిటీలు ఏర్పాటు చేయాలని, దీంట్లో 16 కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలిన కమిటీలు పూర్తిచేయాలన్నారు. క్లస్టర్ స్థాయితో సమీక్షా సమావేశాలకు వచ్చే సరికి ఆయా పంచాయతీల్లో అన్ని కమిటీలు పూర్తిచేయాలన్నారు. మండల కమిటీలు మరో వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. నాలుగు మండలాల్లో ప్రధాన నాయకులు బాధ్యతలు తీసుకోవాలని కోరారు. గురువారం నుంచి చేపట్టన్న కార్యకర్తల చెంతకు కృష్ణచైతన్య కార్యక్రమం గురించి ఆరా తీశారు. రోజుకు రెండు క్లస్టర్లు చొప్పున సమీక్ష ఉంటుందని, ఆయా గ్రామాలకు వచ్చినప్పుడు గ్రామ కమిటీలు పూర్తిచేయాలని, కమిటీల్లో వేసిన వారి పేర్లు ఆయా సభ్యులకు తెలియజేయాలన్నారు. ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక సలహాదారుడు ముద్దాడ బైరాగిపాయుడు, పార్టీ నాయకులు చింతు రామారావు, నక్క తులసీదాస్, వరుదు వంశీకృష్ణ, లుకలాపు రవి, కనుసు సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

సకల విజయాలు కలగాలి



హిరమండలం: ప్రజలకు సకల విజయాలు కలగాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆకాంక్షించారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండగ నిర్వహిస్తారన్నారు. దసరా అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. రైతుల ఇంట సిరులు కురిపించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, అభిమానులకు, అనుబంధ విభాగాల ప్రతినిధులకు, ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

దసరాకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ కాంతులతో సిద్ధమైన నీలమణిదుర్గ ఆలయం



క్యూ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

- వాహన పూజలకు ప్రత్యేక క్యూ..
- ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయానికి దసరా సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పాతపట్నం సీఐ ఎన్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం స్టేషన్ల నుంచి వచ్చిన పోలీసులతోపాటు రిజర్వ్ పోలీసులు గురువారం బందోబస్తు నిర్వహించానున్నారు. అమ్మవారి ఆలయం ముందు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. వాహన పూజలను ఆలయం ముందు చేసుకోవాలని సీఐ సూచించారు. ఆలయ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు పాటించాలన్నారు. అమ్మవారి అలయం ఎదురుగా ఉన్న మామిడితోటలో పార్కింగ్ చేయాలన్నారు. టెక్కలి నుంచి పాతపట్నం వచ్చే బస్సులు ఆలయం వెనుక రహదారి మీదుగా వెళ్లాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని ఆలయ చైర్మన్ అక్కందర సన్యాసిరావు అన్నారు. బుధవారం సాయంత్రం సీఐతో కలిసి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



కొర్లకోటలో అవగాహన కల్పిస్తున్న ఏఓ మోహన్‌రావు, తదితరులు

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట గ్రామంలో ఏఓ మెట్ట మోహన్‌రావు ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లపై రైతులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు సందర్భంగా వ్యవసాయ పనిముట్లపై భారీగా రేట్లు తగ్గాయని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జీఎస్టీ తగ్గింపు ప్రకటించడంతో రైతులకు ఆ ప్రయోజనాలు నేరుగా చేరేలా ఈ సదస్సుతోపాటు ట్రాక్టర్ ర్యాలీని కూడా నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వ



నందికొండ కాలనీలో నిల్వ ఉన్న వర్షంనీరు

సరుబుజ్జిలి: మండల కేంద్రానికి ఎదురుగా ఉన్న నందికొండ కాలనీలో మురుగు కాలువలను ఆక్రమణలకు గురయ్యాయి. వర్షాలు పడితే నీరు నిల్వ చేరి ప్రజలు బయటకు వచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు. నిల్వ చేరిన నీరు రోజుల తరబడి ఉండిపోవడం వలన ఈగలు, దోమలు చేరుతున్నాయి. దీనివలన తరచూ ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మహిషాసురమర్దినిగా



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలోని సూర్యదేవుని ఆలయం వద్ద లలితా సహస్ర పారాయణంలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస: పట్టణంలో రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు



కొత్తూరు: అల్లు వీధిలోని భావనమ్మ గుడి వద్ద బతుకమ్మ పండగను నిర్వహిస్తున్న మహిళలు



నరసన్నపేట: కార్ స్టాండ్ వద్ద దుర్గాదేవిని పూజిస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మామన కృష్ణచైతన్య, తదితరులు

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాల్లో భక్తులు కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్